క్లుప్తంగా

బస్‌షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి


బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బీబీనగర్: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రయాణ ప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కోరారు. బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో నిర్మించిన బస్‌షెల్టర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీత, సర్పంచ్ సుదర్శన్, ఎంపీటీసీ వసంత, ఉప సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట: జనంపల్లి (రామన్నపేట) బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పీజీటీ, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు ఎంఏ, ఎమ్మెస్సీ అర్హతగల అభ్యర్థులు, పాఠశాలలో పీజీటీ, తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, బయోలజీ సబ్జెక్టులు బోధించేందుకు బీఏ, బీఎస్సీ, బీఈడీ అభ్యర్థులు, స్టాఫ్ నర్సు పోస్టుకు జనరల్ నర్సింగ్, పీఈటీ పోస్టుకు బీపీడీ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని కేజీబీవీలో 2023– 24కు సంబంధించి అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి పద్మ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇంగ్లిష్ మీడియం ఆరో తరగతిలో 40, ఏడవ తరగతిలో 9, ఎనిమిదవ తరగతిలో ఒకటి, తొమ్మిదవ తరగతిలో 12 సీట్లు, 10 తరగతి తెలుగు మీడియంలో 20 సీట్లు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 97008 02313ను సంప్రదించాలని కోరారు.

గీత కార్మికులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు: గీత కార్మికుల బీమా కోసం పీసీఎస్ లైసెన్స్ కలిగిన సొసైటీల్లో సభ్యత్వం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కోరారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు.

12న వాహనాల వేలం

రామన్నపేట: ఎక్సైజ్ శాఖ వివిధ కేసుల్లో సీజ్ చేసిన కారు, రెండు ద్విచక్రవాహనాలను సోమవారం రామన్నపేటలో బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సీఐ నాగలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రామన్నపేట ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 9గంటల వరకు నిర్ణయించిన ధరలో 50 శాతం చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


పూజల్లో పాల్గొన్న వేముల వీరేశం

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరంలో శ్రీ పద్మావతి సమేత బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద శనివారం ధ్వజస్తంభ, గణపతి, గరుడ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వీరేశం వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు పూస బాలకిషన్, గంగుల వెంకటరాజిరెడ్డి, జెల్ల వెంకటేశం ఉన్నారు. వేడుకల్లో సర్పంచ్ కాటిపల్లి సిద్దమ్మ, ఎంపీటీసీ పూస బాలమణి, ఉపసర్పంచ్ గర్దాసు సురేష్, ఆలయ చైర్మన్ వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు బోనగిరి వెంకటేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


వెల్మజాలలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

గుండాల, అడ్డగూడూరు: వికలాంగుల పింఛన్‌ను సీఎం కేసీఆర్ అదనంగా రూ.వెయ్యి పెంచడాన్ని హర్షిస్తూ శనివారం గుండాల మండలంలోని వెల్మజాలలో, అడ్డగూడూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దివ్యాంగులు కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో వెల్మజాల సర్పంచ్ బాలకృష్ణ, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ యాదవ్, ఉప సర్పంచ్ పాండు, జిల్లా హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు రమేష్, యాదగిరి, అవిలయ్య, మహబూబ్‌రెడ్డి, సైదులు, రవి, వీరభద్రయ్య, దామోదర్ పాల్గొన్నారు.

● ఎండుతున్న నారుమళ్లు

గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు, విరిగిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో పదిహేను రోజులుగా వ్యవసాయానికి త్రిఫేజ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో వరి నారుమళ్లు, దున్నిన పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విరిగిన స్తంభాల పునఃరుద్ధరించి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

– గుండాల


మాసాన్‌పల్లిలో ఎండిపోయిన వరి నారుమడి

● కంఠమహేశ్వర బోనాలు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురం గ్రామంలో శ్రీసురమాంబ సమేత శ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయం కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం బోనాల పండుగ నిర్వహించారు. అమ్మవారు, స్వామివారికి మహిళలు బోనాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో వైస్‌ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, సర్పంచ్ పర్నె రజిత, ఉపసర్పంచ్ బైరు బాలరాజుగౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ కప్పల అంజయ్య, గౌడసంఘం అధ్యక్షుడు పాలకూర్ల అంజయ్య, కమిటీ ప్రతినిధులు, గౌడ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రాజీమార్గమే రాజమార్గం


చౌటుప్పల్‌లో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి మహతివైష్ణవి


రామన్నపేటలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్

● చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహతి వైష్ణవి

చౌటుప్పల్: రాజీ మార్గంతో కక్షిదారులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహతి వైష్ణవి అన్నారు. శనివారం చౌటుప్పల్‌లోని కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్టు పరిధిలోని చౌటుప్పల్, పోచంపల్లి, నారాయణపురం మండలాలకు సంబంధించి 2,326 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు పంతాలను పక్కనపెట్టి రాజీ కుదుర్చుని కేసులు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాల రమేష్, న్యాయవాదులు ఊడుగు శ్రీనివాస్, తాడూరి పరమేష్, బడుగు శ్రీకాంత్, జెల్ల రమేష్, అల్లి స్వాతి, జక్కర్తి శేఖర్ తదితరులున్నారు.

కేసులు పరిష్కరించుకోవాలి

రామన్నపేట: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు కోర్టు జడ్జి చందన అన్నారు. శనివారం రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జూనియర్ సివిల్ జడ్జిలో 51 కేసులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 1487 కేసులు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిలో 222 కేసులను పరిష్కరించారు. మండల లీగల్ సర్వీస్ చైర్మన్ ప్రదీప్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గోవర్ధన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పంతంగి శోభన్‌బాబు, సీఐ మోతీరాం, పీపీ అవినాష్, న్యాయవాదులు యాదగిరిస్వామి, జినుకల ప్రభాకర్, నకిరేకంటి మొగులయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, దినేష్, స్వామి, సత్తయ్య, ఖాజా, సూపరింటెండెంట్ గంగాభవాని, భిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ఆలేరురూరల్: రాజీమార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారమవుతాయని ఆలేరు సివిల్ కోర్టు జడ్జి సూర సుమలత అన్నారు. శనివారం ఆలేరు కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో ఇరువర్గాల వారు కక్షసాధింపులకు వెళ్లకుండా లోక్ అదాలత్‌లో రాజీ పడి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావుల రవీందర్ రెడ్డి, సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్సై వెంకటశ్రీను, పీపీ పద్మ, లాయర్లు గొట్టిపాముల సాయి కృష్ణ, వంగరి శివ, గణేష్, ప్రసాద్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సివిల్ కోర్టు జడ్జి సుమలత

మున్సిపాలిటీలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో 11వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో శనివారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, బొడిగె అరుణబాలకృష్ణ, తాడూరి శిరీషపరమేష్, సుల్తాన్ రాజు, గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేష్, నాయకులు ముత్యాల భూపాల్‌రెడ్డి, చిరందాసు ధనుంజయ, డిల్లీ శంకర్‌రెడ్డి, అయ్యాడపు ప్రతాప్‌రెడ్డి, పోలోజు శ్రీనివాస్‌చారి, గోశిక రవీందర్, తొర్పునూరి మల్లేష్, సందగళ్ల నాగరాజు, గోశిక నర్సింహ తదితరులున్నారు.


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

రామన్నపేట: మండలంలోని మునిపంపుల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో జల, ధాన్య, పుష్ప, శయ్యాధివాస పూజల అనంతరం యంత్రస్థాపన చేసి నాభిశిల(బొడ్రాయి)ను ప్రతిష్ఠించారు. సాయంత్రం మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నైవేద్యం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గౌడ కులస్తులు కాటమయ్య, ఎల్లమ్మ దేవతలకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదాసు కవిత, ఎంపీటీసీ గాదె పారిజాత, ఉపసర్పంచ్ డోగిపర్తి పద్మ, నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట మంచిరాజు శరత్‌చందర్, అయ్యాడపు నర్సిరెడ్డి, గాదె శోభ, లక్ష్మారెడ్డి ఉన్నారు.


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజలు నిర్వహిస్తున్న విప్ సునీత

● ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

బొమ్మలరామారం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. బొమ్మలరామారం మండలంలోని ప్యారారం గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ఆమె హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ప్రతిష్ఠాపనోత్సవానికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పోలగొని వెంకటేష్ గౌడ్, సర్పంచ్ చిమ్ముల రవీందర్ రెడ్డి, జూపల్లి భరత్, కట్టా శ్రీకాంత్ గౌడ్, బోనంకూర మల్లేష్, మైలారం రామకృష్ణ, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది కాచరాజు జయప్రకాశ్‌రావు

భువనగిరిటౌన్: కాచరాజు జయప్రకాశ్‌రావు గొప్ప మానవతావాది అని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. శనివారం భువనగిరిలోని వెటర్నరీ భవన్‌లో నిర్వహించిన కాచరాజు సంతాప సభలో ఆయన మాట్లాడారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగా అరుణ, యూటీ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య, టాప్రా జిల్లా కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అక్షింతల కృష్ణమూర్తి, రచయిత పాలకుర్తి రామ్మూర్తి, అడ్వకేట్ జిట్టా భాస్కర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొండమడుగు నర్సింహ, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, సామాజిక ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.


కాచరాజు జయప్రకాశ్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సంక్షిప్త సమాచారం

→ రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఈ నెల 14, 15,16 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మేక అశోక్ రెడ్డి, మంగ నర్సింహులు, బూరుగు కృష్ణా రెడ్డి, కోట రామచంద్రారెడ్డి, గన్నెబోయిన భాస్కర్, కొండా అశోక్, జిట్టా అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

→ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

తుర్కపల్లి: తుర్కపల్లి నుంచి యాదాద్రి వరకు రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. రోడ్డు మధ్యలో భగీరథ పైప్‌లైన్ ఉండడంతో లీకేజీలు జరుగుతున్నాయని, వెంకటాపూర్‌లో పైప్‌లైన్ లీకేజీ అయిన చోట ఎనిమిది ప్రమాద ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. శనివారం తుర్కపల్లి మండలంలోని వెంకటాపూర్‌లో పగిలిపోయిన మిషన్ భగీరథ పైప్‌లైన్ వద్ద గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నారా భిక్షపతి, సత్యనారాయణ, మల్లయ్య, సత్తయ్య, నాగరాజు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

→ పరిహారం ఇవ్వాలి

భువనగిరిటౌన్: బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులు ఇళ్లు కట్టుకోవడానికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని ఎంపీటీసీ ఉడుత శారదా ఆంజనేయులు, ఉపసర్పంచ్ ఎడ్ల దర్శన్ రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారిలో 8వ వార్డు సభ్యులు వల్లందాస్ పరమేష్ కుమార్ ఉన్నారు.

→ పిడమర్తికి సన్మానం

మోత్కూరు: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి శనివారం ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా మోత్కూరులో అంబేద్కర్ చౌరస్తా వద్ద కొద్దిసేపు ఆగారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చేడె మహేందర్, నాయకులు చుక్క శ్రీకాంత్, కూరెళ్ల కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

→ ఆర్థికసాయం అందరికీ వర్తింపజేయాలి

మోత్కూరు: బీసీ కులాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం బీసీ కులాల మొత్తానికి వర్తింపజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోచం సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఆయన వెంట ఓబీసీ మోర్చా మండల నాయకులు సజ్జనం మనోహర్, ముత్తినేని తిరుమలేష్, కొప్పు యాకేష్ ఉన్నారు.

→ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని మైనార్టీ డెవలప్‌మెంట్ భువనగిరి కమిటీ ప్రతినిధి ఎంఏ హాఫీజ్‌వసీమ్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. అర్బన్‌కాలనీ మున్సిపాలిటీలో పెద్ద ఆవాస ప్రాంతం అని, మూడు వార్డులు ఇక్కడే ఉన్నాయని తెలిపారు. రైల్వే గేట్ కారణంగా చాలా మంది ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత విద్య అభ్యసించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

→ విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

తుర్కపల్లి: విధుల్లో ఆశ వర్కర్లు నిర్లక్ష్యం వహించొద్దని వైద్యాధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం తుర్కపల్లి మండలంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో ఆశ వర్కర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

→ ఓబీసీ మండల అధ్యక్షుడిగా నర్సింహగౌడ్

భువనగిరి: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షుడిగా భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన మచ్చ నర్సింహగౌడ్ నియామకమయ్యారు. శనివారం పట్టణంలోని రహదారి బంగ్లాలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాహుల్ నర్సింహకు నియామకపత్రం అందజేశారు.

→ విరాళం అందజేత

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో కంఠమహేశ్వరస్వామి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి సమకూర్చిన రూ.30వేలను ఆ పార్టీ నాయకులు ఉత్సవ నిర్వాహకులకు శనివారం అందజేశారు. అదేవిధంగా ఎర్రగోని లింగస్వామి రూ.15వేలు, కళ్లెం దయాకర్‌రెడ్డి రూ.5వేల చొప్పున విరాళాన్ని అందించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వలిగొండ: వలిగొండ మండల కేంద్రంతోపాటు మల్లెపెల్లి, లోతుకుంటలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలువురి ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వీరికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలన్నారు. తన వంతు సాయంగా వలిగొండకు చెందిన కీర్తి వెంకటేశంకు రూ.50 వేలు, ఉందాడి యాదమ్మకు రూ.50 వేలు, కుమార్‌కు రూ.20 వేలు, కనకబోయిన సాయిలుకు రూ.15 వేలు, లోతుకుంటలోని బాతరాజు కమలమ్మకు రూ.30 వేలు, మల్లెపెల్లిలో కొక్కల భిక్షపతికి రూ.50 వేలు, యార వెంకటేశంకు రూ.20 వేలు, పల్లెర్ల సంతోషకు రూ.20 వేలు, యార బాల రాజుకు రూ.20 వేలు, పల్లెర్ల శ్రీశైలంకు రూ.10 వేలు, లక్ష్మయ్యకు రూ.10 వేలు, రేగు బక్కయ్యకు రూ.20 వేలు, మాల్గ నాగులుకు రూ.20 వేలు, రేగు లింగ స్వామికి రూ.20 వేలు, కొక్కల శ్రీనుకు రూ.20 వేలు అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ బోళ్ల లలితా శ్రీనివాస్, పాశం సతిరెడ్డి, బాథరాజు ఉమా బాల నర్సింహ, ఎంపీటీసీలు తదితరులున్నారు.

భూ నిర్వాసితులను కలిసిన కుంభం

భువనగిరి: మండలంలోని రాయగిరి గ్రామంలో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులను డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం కలిసారు. ఈ సందర్భంగా రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ చేసిన ధర్నాలో అరెస్టు కాబడిన రైతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జైలులో ఉన్న రైతులకు బెయిల్ వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్యాంసుందర్, లావణ్య దంపతులు పిల్లలను పరామర్శించారు. వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కూనూరు ఎంపీటీసీ పాశం శివానంద్, భూ నిర్వాసితులు ఉన్నారు.


మాట్లాడుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

30 రోజులకు బదులు 38 రోజుల విద్యుత్ బిల్లు

యాదగిరిగుట్ట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణంగా విద్యుత్ బిల్లు 30 రోజులు లేదా.. 31 రోజులకు చెల్లించాల్సి వస్తుంది. కానీ యాదగిరిగుట్ట విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మే– జూన్ కలిపి 31 రోజులకు బదులు 38 రోజుల బిల్లు ఇస్తున్నారు. దీంతో స్లాబ్ రేట్ పెరిగి, అదనపు బిల్లు కట్టాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇలా అధిక రోజులకు సంబంధించిన బిల్లులు వచ్చిన బాధితులు నలుగురు ఉన్నారు. మరి ఇంకెన్ని కుటుంబాలకు 38 రోజుల బిల్లు వచ్చిందనేది తెలియాల్సి ఉంది. ఈ విషయంపై విద్యుత్‌సిబ్బంది దోపిడీని అరికట్టాలని వాట్సాప్ గ్రూప్‌లో బాధితులు పోస్టులు పెడుతున్నారు.

సుపరిపాలనా ర్యాలీ


అడ్డగూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, నాయకులు

అడ్డగూడూరు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం అడ్డగూడూరులో ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో సుపరిపాలనా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అయోధ్య, మండల ఉద్యోగులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ నాయక్, మండల ఏఓ అరుణకుమారి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, సత్యం గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సుపరి పాలనా దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు జన్నాయికోడె నగేష్, బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, లగ్గాని రమేష్ గౌడ్, నాయిని నర్సింహారెడ్డి, గనగాని మాధవి, వరలక్ష్మి, సత్తయ్య పాల్గొన్నారు.

పూల నాగయ్యకు సన్మానం

ఆలేరురూరల్: హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అవార్డు గ్రహీత, పీఈటీ పూల నాగయ్యను ఉమెన్ రైట్స్ క్లబ్ శనివారం ఘనంగా సత్కరించింది. ఈనెల 8, 9 తేదీల్లో రాజమండ్రిలో ఉమెన్స్ రైట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన బాలల హక్కులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత పోక్స్, ఇంటర్‌నెట్, మాదకద్రవ్యాలు, సెక్స్ ఎడ్యుకేషన్ వివిధ అంశాలపై మాట్లాడారు. క్రీడా, సాంస్కృతిక, సాంఘిక, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అంబేద్కర్, రమేష్, ఆనంద్, జితేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


నాగయ్యను సన్మానిస్తున్న హెచ్‌ఆర్‌సీ సభ్యులు

పరీక్షా కేంద్రం దూరం..

● ఆందోళనలో 400 మంది విద్యార్థులు

మోత్కూరు: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు 14 నుంచి 26వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతి యేటా మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల విద్యార్థులకు మోత్కూరులో సప్లిమెంటరీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసే వారు. కానీ ఈసారి భువనగిరిలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తుండడంతో దూరం అవుతుందని మోత్కూరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, గుండాల మండలాలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సమస్యల వలయంలో భువనగిరి బస్టాండ్

● కుర్చీలు లేక, ఫ్యాన్లు తిరగక ప్రయాణికుల పాట్లు
● సమయానికి రాని బస్సులు

భువనగిరిటౌన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రయాణికులు బస్టాండ్‌కు వస్తుంటారు. భువనగిరి బస్టాండ్ నుంచి బస్సులు ప్రతిరోజు కనీసం 650కి పైగా ట్రిప్పులు తిరుగుతుంటాయి. కానీ ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనిచేయని ఫ్యాన్లు

గతంలో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. వాటి నిర్వహణను ఆర్టీసీ అధికారులు సక్రమంగా చేయకపోవడంతో ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. బస్టాండ్‌లో సుమారు 14 ఫ్యాన్లు ఉండగా అందులో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. వేసవి కావడంతో ఉక్కపోతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


బస్టాండ్‌లో వృథాగా ఉన్న ఫ్యాన్లు

గంటల తరబడి..

బస్సులు బస్టాండ్‌కు సరైన సమయానికి రావడం లేదు. దీంతో తమ గమ్యస్థానానికి చేరుకునేందుకు ప్రయాణికులు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. వీరికి కూర్చోడానికి కుర్చీలు కూడా సరిపోను లేవు. రాత్రి 7 గంటలు అయితే హైదరాబాద్, హన్మకొండ వైపు వెళ్లే బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎవరైనా ప్రయాణికులు 9 గంటలకు బస్టాండ్‌కు వస్తే మొత్తం ఖాళీగా దర్శనమిస్తుంది. ఆలేరు, ఉప్పల్, వలిగొండ, ఆత్మకూర్ అంటే కనీసం 35 కిలోమీటర్లు దూరం వెళ్లే బస్సులు కూడా ఉండడం లేదు.

చెట్ల కింద నిలబడుతున్నారు



బస్టాండ్‌లో ఫ్యాన్లు తిరగక పోవడంతో ప్రయాణికులు బస్టాండ్ పక్కన ఉన్న చెట్ల కింద నిలబడుతున్నారు. భువనగిరి బస్టాండ్‌కు రాత్రి అయితే ఒక్క బస్సు కూడా రావడం లేదు. రాత్రి 7 దాటితే హైదరాబాద్ నుంచి భువనగిరికి, భువనగిరి నుంచి జనగాంకు బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

– దేవరకొండ నర్సింహాచారి, భువనగిరి

సమయపాలన పాటించడం లేదు



భువనగిరి బస్టాండ్‌లో బస్సులు ఏ సమయంలో వస్తాయని బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బస్టాండ్‌లో ఫ్యాన్లు కూడా తిరగకపోవడంతో ఉక్కపోతగా ఉంది.

– నర్సింహ, అక్రూర్